సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగుతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. గాజులరామారం ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంట వరకు... అదే విధంగా ఉషోదయకాలనీ, బాలాజీ లేఅవుట్, సోమిరెడ్డికాలనీ, గాజులరామారం గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిజాంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో...

నిజాంపేట్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ రాకేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. శ్రీనివాసకాలనీ ఫీడర్ పరిధిలోని 191 కాలనీ, ఎన్టీఆర్‌నగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. ప్రశాంతిహిల్స్ ఫీడర్ పరిధిలోని మధునగర్, ప్రశాంతి హిల్స్ కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎన్‌సీఎల్, బాలాజీ ఫీడర్ల పరిధిలోని కేవీఆర్ ఫంక్షన్‌హాలు లేన్, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివరెడ్డి గార్డెన్స్ ఎన్‌సీఎల్ నార్త్, ఎన్‌సీఎల్ స్విమ్మింగ్ పూల్స్, ప్రణాయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్స్, అంగడిపేట్ గ్రామం, టవర్ లైన్ రోడ్డు, శ్రీని గేట్ 1, 2, 3, లయన్ పార్క్, కాస్ హోటల్, కాంటన్ పార్క్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు.. అదే విధంగా వెన్‌సాయి, సెయింట్ ఆన్స్ ఫీడర్ల పరిధిలోని జయభేరి గార్డెన్ సొసైటీ, కేవీఆర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సుభాష్‌నగర్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఒక వరం లాంటిదని కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూరారంలోని కుత్బులాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రూ.1,70,19,720 విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 170 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల వ్యవధిలో మరో 180 మందికి చెక్కులు అందజేయనున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకానికి దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సాయి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గోదాంల నిర్మాణాలపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో నిబంధనల విరుద్ధంగా బహుళ అంతస్తులు, గోదాంలు నిర్మిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాంగ్రెస్ నాయకులు గడ్డం ప్రసన్నకుమార్ ఆరోపించారు. దూలపల్లిలోని ఫాక్స్‌సాగర్ చెరువును ఆనుకుని స్టీల్ సిటీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న గోదాంలు, గ్రామంలో అనుమతులేని లేఔట్‌లో నిర్మిస్తున్న భవనాల విషయమై మంగళవారం ప్రసన్నకుమార్ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు 100 గజాలలోపు ఇల్లు కట్టుకుంటే ఎన్నో నిబంధనలు చెప్పే అధికారులకు బహుళ అంతస్తుల నిర్మాణాలను పట్టించుకోరా అని ఎద్దేవా చేశారు.

ఆర్‌పీఐ కార్యకర్తల సమావేశం

సుభాష్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) కార్యకర్తల ముఖ్య సమావేశం మంగళవారం సూరారం డివిజన్ శివాలయనగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభుదాస్, రాష్ట్ర సెక్రటరీ ప్రేమ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా కడెం గౌతమ్, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడిగా బి.సాంబ, మహిళా అధ్యక్షురాలుగా రాణి, జనరల్ సెక్రటరీగా మల్లేశ్వరి, కోశాధికారిగా సుజాతలను నియమించి వారికి నియామక పత్రాం అందజేశారు. ప్రభుదాస్, ప్రేమ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. అన్ని వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

లారీ ఢీకొట్టడంతో నేలకొరిగిన 5 స్తంభాలు

జీడిమెట్ల: జీడిమెట్ల నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డులో 5 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఉదయం 5గంటల సమయంలో స్థానికులు గ్రహించి జీడిమెట్ల విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జేఈ కృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను వీక్షించారు. అందులో ఓ లారీ స్తంభాలను ఢీకొట్టి వెళ్లినట్లు గుర్తించి పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాత్రిపూట చీకటిగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

రాష్ట్ర అటవీ అకాడమీలో క్రీడా పోటీలు షురూ



వివిధ అటవీ సర్కిళ్ల నుంచి క్రీడాపోటీలకు హాజరైన అటవీ శాఖ సిబ్బంది



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అటవీ సంరక్షణాధికారి రాకేశ్ మోహన్ దోబ్రియాల్

సుభాష్‌నగర్: దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడల్లో చార్మినార్, భద్రాద్రి, రాజన్న, యాదాద్రి, జోగులాంబ, బాసర, కాళేశ్వరం అటవీ సర్కిళ్లకు చెందిన అటవీ అధికారులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి అటవీ ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి రాకేశ్ మోహన్ డోబ్రియాల్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాకేశ్ మోహన్ మాట్లాడుతూ... క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అకాడమీ సంచాలకులు ఎల్యుసింగ్ మేరు, అటవీశాఖ ఉన్నతాధికారులు, ఎంసీ పర్గెయిన్, జి.చంద్రశేఖర్‌రెడ్డి, సునీత భగవత్, సోనీబాలాదేవి, వినోద్‌కుమార్, రామలింగం, రమేశ్, సైదులు, భీమానాయక్, శివాని డోగ్రా, వివిధ జిల్లాల అటవీ అధికారులు, డివిజనల్ అధికారులు, అకాడమీ అధికారులు పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

సైనికా.. నీ త్యాగం వృథా కాదు



పుల్వామా దాడిలో అమరులైన జవాన్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు సీపీఐ నాయకులు నివాళులర్పించారు. మంగళవారం జగద్గిరిగుట్టలో సీపీఐ శాఖ కార్యదర్శి సహదేవ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, మండల కార్యదర్శి ఉమామహేష్ ఆధ్వర్యంలో అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ... ఉగ్రదాడిలో ప్రాణాలు కొల్పోయిన జవాన్లను అమరులుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడం అవమానకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు హరినాథ్, మహిళా సమాఖ్య కార్యదర్శి హైమావతి, నాయకులు సాయిలు, రాములు, దేవనంద్, ఇమామ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్‌ల తీరు గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ'

కుత్బుల్లాపూర్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు ద్వంద్వనీతితో ప్రజలను మోసం చేస్తున్నాయని టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. 9వ రోజు హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా కుత్బుల్లాపూర్‌లో ఆయన పర్యటించారు. కుత్బుల్లాపూర్ ఎల్లమ్మగుడి నుంచి కాకతీయనగర్, మహేంద్రనగర్, ఇంద్రసింగ్ నగర్, వాణినగర్, వెంకటేశ్వరనగర్, మార్కెట్ రోడ్డు గుండా వెళ్తూ కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీరు గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లు వ్యవహరిస్తున్నాయని అన్నారు. పాదయాత్రలో డీసీసీ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, అల్ ఇండియా దళిత్ సేవా అధ్యక్షుడు జేమ్స్, ఆనంద్‌రావు, ఎండీ జాకీర్, జెస్సీపాల్, ఆగమయ్య, హఫీజ్, సిద్ధయ్య, ఈశ్వర్, బాలరాజు, సాయి మహిళా నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి క్యూసమ్ ఈ-స్కూటర్

కుత్బుల్లాపూర్: హీరో మోటో కార్ప్‌లో సరికొత్త టెక్నాలజీతో 110సీసీ క్యూసమ్ ఈ స్కూటర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సరికొత్త ఫీచర్లతో నగర మార్కెట్‌లోకి వచ్చిన ఈ స్కూటర్ ఎల్ఎక్స్, యూఎక్స్, ఎక్స్‌టెక్ మూడు వేరియంట్లలో లభిస్తుందని హీరో సంస్థ తెలంగాణ ఏరియా మేనేజర్ మనేష్ జైన్ తెలిపారు. మంగళవారం సుచిత్రలోని గీతా హీరోషోరూంలో ఈ స్కూటర్‌ను ఎస్‌బీఐ అఫీషియల్స్ రవిబాబు, హిమబిందులు ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ మూడు వేరియంట్ల ధరలు రూ.72,749, 75,899, 80,899లుగా ఉన్నాయని సేల్స్ మేనేజర్ వినీత్, టెరిటరీ మేనేజర్ బిబెక్ పాత్ర, కుషాగ్ర శర్మ తెలిపారు. వినియోగదారులు సుచిత్రలోని గీతా హీరో షోరూంకు వచ్చి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.




అమ్మవారికి ప్రత్యేక పూజలు



శ్రీరేణుకాఎల్లమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మదేవి ఆలయ 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ , కార్పొరేటర్ రావుల శేషగిరి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు గంగారం, ప్రేమ్ కుమార్, వెంకట్, బాలు, నాగరాజు, హనుమంత్, సూరి, రాజు, శేఖర్, సంజు, నాగరాజు రవి, భక్తులు తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

ఆలయంలో ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు పూజలు



కుటుంబ సమేతంగా హోమపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కుటుంబ సమేతంగా శ్రీసహకార మెట్ల ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమపూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుభాకాంక్షలు

తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఒకే ఒక్కడు.. 20 దొంగతనాలు



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ గంగారాం

జీడిమెట్ల: ఒకే ఒక్కడు 20దొంగతనాలు.. ఒక అత్యాచారం.. ఏడేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. జైలుకు వెళ్లి వచ్చినా తన బుద్ధి మాత్రం మార్చుకోలేదు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 20 దొంగతనాలు చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరిగాడు. ఎట్టకేలకు జీడిమెట్ల పోలీసుల వలకు చిక్కాడు.

- మంగళవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ గంగారాం కేసు వివరాలను వెల్లడించారు. జనవరి 31వ తేదీన చింతల్ శివనగర్‌లోని మనోహర్ ఇంట్లో దొంగలు పడి 8తులాల బంగారంతో పాటు రూ.15లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. ఏసీపీ గంగారం జీడిమెట్ల డీఐ రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ పవన్‌లను రెండు బృందాలుగా ఏర్పాటు చేశారు.

టెక్నికల్ ఆధారాలతో పట్టుకున్నారు..

చింతల్‌లో దొంగతనం జరిగిన విధానాన్ని సీసీ ఫుటేజీలతో పాటు వేలిముద్రలను పోలీసులు సేకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం దొంగ సూరారం కాలనీకి చెందిన కమ్మసింగ్ అలియాస్ కరణ్‌సింగ్(34)గా గుర్తించారు. అతనిపై నిఘా ఉంచిన పోలీసులు మంగళవారం సూరారంలోని ఓం జెండా వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. జీడిమెట్లలో 4, జగద్గిరిగుట్టలో 2, చిలకలగూడలో 4, తుకారంగేటులో 3, మల్కాజిగిరిలో 4, కామారెడ్డిలో 3 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు.

రూ.30లక్షల సొత్తు రికవరీ...

నిందితుడి నుంచి పోలీసులు మొత్తం రూ.30లక్షల విలువ చేసే 316గ్రాముల బంగారం, 1.26కిలోల వెండి, రూ.15లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండుకు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ ఎం. పవన్, డీఐ రామకృష్ణ, ఎస్సై అంజనేయులు, కానిస్టేబుళ్లను డీసీపీ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కుత్బుల్లాపూర్: గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి, జిల్లా అసిస్టెంట్ ప్రోహిబిషన్ అధికారి మాధవయ్య, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారి యాదయ్య వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు బొల్లారం నుంచి వేరే ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. అప్రమత్తమైన సిబ్బంది మల్లంపేట్ వద్ద వేచి ఉన్నారు. ఈ క్రమంలో బీహెచ్ఈఎల్‌కు చెందిన బ్రజేంద్రకుమార్(39), సూరజ్‌కుమార్ బీహారీ(34) ప్యాషన్ ప్రోబైక్‌పై వస్తుండగా ఇద్దరిని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి 3.75కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

ప్రభుత్వ, చెరువు స్థలాల సంరక్షణలో విఫలం

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు సతీష్



తుర్క చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఫెన్సింగ్ వేసిన దృశ్యం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువు స్థలాలు కబ్జాల పాలవుతున్నా పట్టించుకోవడం లేదని కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. మంగళవారం తుర్క చెరువు కబ్జా విషయమై తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... నిజాంపేట్ సర్వే నం.348లోని తుర్క చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ వేశారన్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కబ్జా తతంగంపై మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులకు బీజేపీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినా స్పందన కరువైందన్నారు. ప్రభుత్వ, చెరువు స్థలాల సంరక్షణలో అధికారులు విఫలమైందన్నారు.

- ఇప్పటికే తుర్క చెరువులో బఫర్ జోన్లలోనే శ్రీచైతన్య కాలేజ్ భవనం, కిచెన్ షెడ్డు ఉన్నాయన్నారు. అదే విధంగా సర్వేనం.334లో కొంత స్థలాన్ని కళాశాల యాజమాన్యం కలుపుకుందన్నారు. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకులు తాజాగా తుర్క చెరువును చదును చేయడంపై అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, సెక్రటరీ ప్రసాద్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్‌నాయక్, కిసాన్ అధ్యక్షుడు ప్రసాద్ రాజు, సీనియర్ నాయకులు జగదీష్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- అసెంబ్లీలో నాయీ బ్రాహ్మణుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా రాజీవ్ గాంధీనగర్ సర్వే నం.79లో కోర్టు కేసుతో పట్టాలు నిలిచిపోయాయని... వెంటనే పరిష్కరించాలని అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే ప్రస్తావించడంపై రాజీవ్‌గాంధీ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

దుండిగల్: హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం ఇల్లెందు, పినపాక, అశ్వరావుపేట నియోజకవర్గాల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ... పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. యాత్రలో భాగంగా ఆయా ప్రాంతాల ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆగ్రహాన్ని వెల్లుబుచ్చారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



మృతుడు శ్రీను

కుత్బుల్లాపూర్: డీసీఎం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి ఆర్కే ఆస్పత్రి సమీపంలో గత కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తున్న శ్రీను (35) సోమవారం సాయంత్రం సుచిత్ర వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా మృతిడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

అన్నదానం



పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ఎట్టకేలకు సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు.. రాజీవ్‌గృహకల్ప సముదాయంలో అక్రమ నిర్మాణాల విషయమై సాక్షిలో ప్రచురితమైన 'ఎక్స్‌టెన్షన్ పేరిట హద్దు అదుపు లేకుండా నిర్మాణాలు' కథనానికి గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం చర్యలకు ఉపక్రమించారు. టౌన్ ప్లానింగ్ అధికారి సంగీత ఆధ్వర్యంలో అనుమతులు లేకుండా వేసిన అదనపు గదుల శ్లాబ్‌లను పగులగొట్టారు. అదే విధంగా సముదాయానికి ఆనుకుని రోడ్డుపైకి జరిగి ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించారు. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి సంగీత తో స్థానిక గృహకల్ప వాసులు వాగ్వాదానికి దిగి అడ్డుకునే ప్రయత్నం చేశారు. 23 బ్లాక్ వద్ద అక్రమ నిర్మాణ శ్లాబ్, రేషన్ దుకాణం సమీపంలో వేసి షెడ్డు, అదే విధంగా 37వ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించారు. మరోసారి అక్రమ నిర్మాణాలకు పూనుకుంటే కఠిన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు.



రేషన్ దుకాణం సమీపంలో షెడ్డు రేకులను తొలగిస్తున్న సిబ్బంది



రాజీవ్‌గృహకల్ప 37వ బ్లాక్ వద్ద షెడ్డు పైకప్పును తొలగించిన దృశ్యం



23వ బ్లాక్ వద్ద అక్రమ నిర్మాణ శ్లాబ్‌ను పగులగొడుతున్న సిబ్బంది



టౌన్ ప్లానింగ్ అధికారి సంగీతను అడ్డుకుంటున్న 23వ బ్లాక్ వాసులు